రేపు మందసలో గిరిజనుల ర్యాలీ

విశాలాంధ్ర-మందస: మందస మండల కేంద్రంగా ఐటిడిఏ (సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ) కార్యాలయం ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కరపత్రంను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా గిరిజన సమాఖ్య నాయకులు సవర హరికృష్ణ, సవర ఎంగిలాకు, సవర కిరణ్ కుమార్ లు మాట్లాడుతూ గిరిజన బ్రతుకులు దుర్భరంగా ఉన్నాయని, అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 2న జరిగే ర్యాలీ విజయవంతం చేయాలని మందస మండలంలోని గిరిజన గ్రామాలలో ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంచి పెట్టారు. గిరిజనుల సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు. ర్యాలీతో పాటు తహసిల్దారు కార్యాలయానికి వెళ్లి గిరిజనుల సమస్యలపై వినతి పత్రం అందజేస్తామని వారు తెలిపారు.

విశాలాంధ్ర శ్రీకాకుళం
మంగళవారం 1, ఏప్రిల్, 2025

గిరిజనులపై అక్రమ సారా కేసులు..

ఎక్సైజ్ శాఖా.. మజాకా...

విశాలాంధ్ర-మందస: మండలం గిరిజన గ్రామాల్లో నాటు సారా తయారీకి అమ్మకాలకు సంబంధం లేని గిరిజన యువకులు, మహిళలు, బాలింతలపై ఎక్సైజ్ పోలీసులు అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని శ్రీకాకుళం జిల్లా గిరిజన సంక్షేమ పరిరక్షణ సంఘం నాయకులు, సంఘం ప్రతినిధులు సవర నరసింహారావు సవర నారాయణరావు సవర హరికృష్ణ సవర బాలకృష్ణ ఎస్ హరి సవర సోమయ్య ఎస్ లక్ష్మణరావు ఎస్ శంకర్ ఎన్ మాధవ ఎన్ జైరాజ్ ఎస్ తులసీరావ్ రైతు కూలీ సంఘం ప్రతినిధి కే రమేష్ లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కొండలోగాం, తాబాగం, చాపరాయి రామరాయి తదితర గిరిజన గ్రామాల్లో ఒక్కొక్క గిరిజన గ్రామంలో 15 నుంచి 20 మంది వరకు గిరిజనులపై అన్యాయంగా సారా కేసులు పెడుతున్నారని వారు తెలిపారు. చదువుకున్న గిరిజన యువకుల పైన రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కూలి పనులు చేస్తున్న గిరిజన యువకుల పైన ఇతర రాష్ట్రాల్లో ఉపాధి కోసం వెళ్లి అక్కడ జీవనోపాధి సాగిస్తున్న గిరిజనులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు ఎక్సైజ్ శాఖ పోలీసులు అక్రమ కేసులు బనాయించడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నారని చేయని నేరానికి కష్టాలు అనుభవించి అధిక వడ్డీలకు అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. అక్రమ కేసులు పెట్టడం వల్ల బెయిల్ కోసం ప్రైవేటు న్యాయవాదులకు ఆశ్రయించి డబ్బులు వెచ్చించాల్సి వస్తుందని వారాలు తరబడి బెయిల్ రాక జైలులో గిరిజనులు ఉంటున్నారని కోర్టు వాయిదాలు కోసం తరచూ వెళ్లాలంటే ప్రయాణ ఖర్చులు ఎక్కువ అవుతున్నాయని వారు తెలిపారు తక్షణమే కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. అక్రమ కేసులు బనాయింపుపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై మానవ హక్కుల కమిషన్ కు, ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు చేస్తున్నట్టు వారు తెలిపారు.

మంత్రి అచ్చెన్నాయుడుకు ఉగాది శుభాకాంక్షలు

తెలియజేసిన ఎంజీఆర్

విశాలాంధ్ర- హిరమండలం/ పాతపట్నం: ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కి శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలును పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో సుమారు 100 కారులతో 500 మంది పైగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులతోకలిసి నిమ్మాడ వెళ్లి ఎమ్మెల్యే మామిడి గోవిందా రావు శుభాకాంక్షలు ను తెలియజేశారు.

మధు కుటుంబాన్ని జనసేన నాయకులు కోత పరామర్శ

విశాలాంధ్ర-పలాస: మండలం గొల్ల మాకన్నపల్లి గ్రామానికి చెందిన జనసైనికుడు కోరాడ మధుసూదన్ దురదృష్టవశాత్తు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ సమాచారం తెలుసుకున్న పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ చైర్మన్, జనసేన నాయకులు కోత పూర్ణచంద్రరావు సోమవారం గ్రామానికి వెళ్లి మధు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అలాగే ప్రముఖ వైద్యులు టీ బాలకృష్ణ తండ్రి తాళబత్తుల మల్లేశ్వరరావు అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో ఆయన కుమారుడు డాక్టర్ బాలకృష్ణ ను కలసి పరామర్శించారు. అలాగే ప్రముఖ న్యాయవాది రవి పట్నాయక్ తల్లి పుష్పలత మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిన వ్యక్తం చేశారు.

తెలుగు నెలల కాలెండర్ ను ఆవిష్కరించిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రణస్థలం: మండలంలో ఎమ్మెల్యే కాంప్ కార్యాలయంలో విశ్వావసు నామ తెలుసు సంవత్సర ఉగాది క్యాలెండర్ ను ఎచ్చెర్ల శాసన సభ్యులు నడుకుదుటి ఈశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ రణస్థలం ప్రఖండ ప్రముఖ్ కిల్లారి శేఖర్, సహ ప్రముఖులు ప్రసాదు వెంకటరమణల, లంక కృష్ణ, ఆర్థిక ప్రముఖ్ కొత్తపల్లి రమేష్, పూర్వ కార్యదర్శి పోతురెడ్డి వెంకటరమణ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్

విశాలాంధ్ర-హిరమండలం: జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు మేరకు మార్చి 29, 30, 31 తేదీల్లో హిరమండలం మేజర్ పంచాయతీ ఇంటి పన్నులు వసూళ్ల పై ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని పంచాయతీ ఈఓ టి హరికృష్ణ విశాలాంధ్ర కు తెలిపారు, హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలో 3392 ఇళ్ళకు గాను 19లక్షల25 వేల రూపాయలు డిమాండ్ కాగా ఇంత వరకు 11 లక్షల87 వేల రూపాయలు వసూలు అయ్యిందని ఇంటి పన్నులు శతశాతం వసూల్ లక్ష్యం తో 2టీమ్ లుగా విభజించి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్న ట్లు ఈఓ పి ఆర్ డి దుంప గోవిందరావు తెలిపారు. ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి మేజర్ పంచాయతీ అభివృద్ధి కి ప్రజలంతా సహకరించాలని జూనియర్ సహాయకులు డి వర కార్తీక్, బిల్లు కలెక్టర్ మంగమ్మ లు కోరారు..

డిజిటల్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించండి

మంత్రి లోకేష్ కు డిజిటల్ అసిస్టెంట్ల వినతి

విశాలాంధ్ర-కవిటి: గ్రామ,వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లకు ఈ మధ్య కాలంలో ఏఎస్ఓగా ప్రమోషన్ కొరకు ఏర్పాటు చేసిన కమిటీ జీవోను వెనకకు తీసుకొన్న సందర్భంగా మళ్లీ జీవోను పునరుద్ధ రించి కమిటీ ఏర్పాటు చేసి మాకు న్యాయం చేయాలని డిజిటల్ అసిస్టెంట్లు విశాఖలో మంత్రి నారా లోకేష్కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిజిటల్ అసిస్టెంట్లలో 80 శాతం బిటెక్, ఎంటెక్, పీహెచ్డీ పట్టాలు పొంది, టెక్నికల్గా మేదస్సు ఉన్నవారే కనుక వారిని టెక్నికల్ వైపు పదోన్నతి కల్పించాలని కోరారు. దీనిపై మంత్రి మీ సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉందని త్వరలో మీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే నారా భువనేశ్వరి దేవి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, విశాఖ ఎంపీ భరత్ ను కలిసి వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏపీ వివిఎస్ఓఏ , గ్రామ వార్డు సచివాలయ జేఏసీ యూనియన్ సభ్యులు పొల్లాయి అశోక్, పి.జగదీష్,గణేష్ జాయి నరేష్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

ముస్లీం కుటుంబాలకు నిత్యావసంరుకులు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: మండలంలో రంజాన్ వేడుకలలో భాగంగా ముస్లిం సోదరులకు సోమవారం నాడు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అనపాన రాజశేఖరరెడ్డి మండల కేంద్రంలోని ముస్లీం వీధిలో సుమారు 30 కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులతో మాట్లాడారు. అనంతరం వారితోపాటు ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో ఆయనతో పాటు శంకరు, రామకృష్ణ, తదితరులున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-టెక్కలి/కోటబొమ్మాళి: ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)తో రాష్ట్రంలోని ఎందరో పేదల ప్రాణాలు కాపాడుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్ లో సోమవారం టెక్కలి నియోజకవర్గంకు చెందిన 14మంది లబ్ధిదారులకు రూ. 14,73, 550/- చెక్కులను లబ్ధిదారులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు. సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్దిదారులు ముఖ్యమంత్రికి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా పోరాటంలో కామ్రేడ్ గుంటి అప్పన్న త్యాగం మరువలేనిది

పోరాటాలే ఊపిరిగా విప్లవ ఉద్యమం

విశాలాంధ్ర-మందస: స్వాతంత్ర్య ఫలాలు అన్ని వర్గాలకు సమానంగా దక్కాలంటూ.. సమ సమాజ నిర్మాణం కోసం ప్రజా పోరాటంలో కామ్రేడ్ గుంటి అప్పన్న చేసిన త్యాగం మరువలేనిదని ఉద్దానం యూత్ ఫోరం కన్వీనర్ మరియా రామకృష్ణ అన్నారు. సోమవారం మండలం గంగువాడలో కామ్రేడ్ గుంటి అప్పన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు అభ్యుదయ వాదులు, ప్రజాస్వామ్య వాదులు, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉద్దానం యూత్ ఫోరం కన్వీనర్ మడియ రామకృష్ణ మాట్లాడుతూ.. కామ్రేడ్ గుంటి అప్పన్న 1990 దశకంలో విప్లవ ఉద్యమంలో ప్రవేశించి ఉద్దానమంతా పర్యటించి, కామ్రేడ్ సుధా నాయకత్వంలో జరిగిన తీర ప్రాంత భూముల పంపిణీలో నిస్వార్ధంగా పనిచేస్తూ వేలాది ఎకరాలు భూములను నిరుపేదలకు పంచిన చరిత్ర కామ్రేడ్ అప్పన్నదని ఆయన గుర్తు చేశారు. ఈ క్రమంలో కామ్రేడ్ అప్పన్న కుటుంబీకులు అనేక కేసులను ఎదుర్కొనడమే కాక రాజ్య హింస ను ఎదిరిస్తూ విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్లారని ఆయన పేర్కొన్నారు. కామ్రేడ్ అప్పన్న జీవితం తెరచిన పుస్తకం అని, విప్లవ ఉద్యమమే ఊపిరిగా శ్వాసించి , జీవితమంతా వివిధ ప్రజల విముక్తి కోసం పరితపించి జనం మదిలో విప్లవోద్యమ ధ్రువతారగా నిలిచారని ఆయన కొనియాడారు. నాటి రాజ్య హింసలో ప్రభుత్వం క్రూర నిర్బంధానికి, అణచివేతకు గురైన, గుండె నిబ్బరంతో అమరుల నెత్తుటి జెండాను సమున్నతంగా నిలబెట్టిన దీశాలి కామ్రేడ్ అప్పన్న అని, ఆయన పోరాటాల ఫలితంగా నేడు ఉద్దాన ప్రాంతం కొంత మేర అభివృద్ధి జరిగిందని ఆయన తెలిపారు. నాడు కామ్రేడ్ అప్పన్న కొనసాగించిన విప్లవ పోరాట ఉద్యమం స్మరించుకోవడం మనందరి కర్తవ్యం అని రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ ఉద్యాన వర్సిటీ పాలకమండలి మాజీ సభ్యులు బత్తిన లక్ష్మణ్, గుంటి రామస్వామి, రమేష్, కపిల్ పాపారావు, దున్న హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మతాల మధ్య చిచ్చు పెట్టొద్దు..

కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతిరావు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: మండలం పూండి గోవిందపురంలో కొందరు మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు పిచ్చి పనులకు పాల్పడ్డారని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు అన్నారు. జిల్లాలో వరుసగా గ్రామంలో ఉన్న హిందూ ఆలయాల గోడలపై అన్యమత ప్రచారం మరియు వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం ఆయన పూండి గోవిందపురం గ్రామంలో ఉన్న శివాలయాన్ని మరియు అయ్యప్ప ఆలయాన్ని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు తో కలిసి అయన ఆలయాలను పరిశీలించి. ఆలయాల అభివృద్ధి కమిటీలకు పలుసూచనలు చేశారు. ముఖ్యంగా ప్రతి ఆలయం లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీపాన గోపి, కో ఆప్షన్ సభ్యులు గొరకల విఘ్నేష్, ఎస్ఎంసి చైర్మన్ శ్రీను, మెట్ట నారాయణ, కొంచాడ ధర్మారావు, కుమ్మరి రాజారావు, ఆలయ అర్చకులు, కర్ని సంతు పాల్గొన్నారు.

భిలాయి లో ఘనంగా ఉగాది వేడుకలు

విశాలాంధ్ర-పలాస: భిలాయి ప్రవాసాంధ్ర ప్రజా నాట్యమండలి అధ్వర్యంలో నెహ్రూ సాంస్కృతిక భవన్ సెక్టార్ -1లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా ఛత్తీస్ ఘఢ్ తెలుగు మహా సంఘం ఉపాధ్యక్షుడు బర్రి జోగారావు, ప్రధాన కార్యదర్శి బి తులసీ రావు, విద్యావేత్త డా. ఎల్ జగన్నాథ్ రావు పాల్గొనగా నాట్య మండలి అధ్యక్షుడు, మహా సంఘం కన్వీనర్ రుద్రమూర్తి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముందుగా తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం దైవజ్ఞ శ్రీ భూషణ్ పండిట్ శేషు పంతులు తన పంచాంగ శ్రవణంలో కొత్త సంవత్సరం దేశంలో సంభవించే మార్పులు, కాలమాన పరిస్థితులను సవివరంగా వివరించారు. మొరిపల్లి పద్మ తెలుగు గీతాన్ని ఆలపించి, ఉగాది పచ్చడిని సభికులకు పంచి పెట్టారు. ఛత్తీస్ ఘఢ్ తెలుగు మహా సంఘం సలహాదారుడు ఎం బాబూరావు వ్యాఖ్యాత గా వ్యవహరించిన కార్యక్రమంలో సి హెచ్ శ్రీనివాస్, ఎం ధర్మారావు, కె వెంకట రావు, ఎల్ చైతన్య, వి యోగి రత్నం,వి సూర్య నారాయణ, పి వెంకట రావు, పి తాతారావు,సి హెచ్ గణపతి,వేదుల సుబ్రహ్మణ్యం, దున్న పాపన్న, గుంటి నాయుడు, ఎం ఈశ్వర రావు,జి సుదర్శన్, టి కృష్ణ రావు, ముత్తి కృష్ణ,కె బాలకృష్ణ, త్రినాథ్ రెడ్డి,వై భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ నిఘా నీడలో పలాస కాశీబుగ్గ



విశాలాంధ్ర-పలాస: నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్ నిఘా పెట్టి,చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పోలీసులు అడ్డుకట్ట వేస్తున్నారు. కాశీబుగ్గ పలాస పరిధిలో పట్టణ ప్రాంతాలు, గ్రామీణ శివారు ప్రాంతాలలో బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి సేవించడం,పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్, పేకాట, జూదం తదితర నేరాలపై జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు కాశీబుగ్గ పోలీసులు సోమవారం డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.ప్రత్యేకంగా పాడుపడిపోయిన ఇల్లు, నివాస గృహాలపై డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించారు.బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి సేవించడం వంటి వారు పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు హెచ్చరించారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం భరోసా : ఎమ్మెల్యే గొండు

విశాలాంధ్ర -శ్రీకాకుళం రూరల్: గత ప్రభుత్వం మత్స్యకారులకు తీరనిలోటు చేసిందని మత్స్యకా రుల భరోసా కూడా ఇవ్వలేని పరిస్థితి కల్పించిందని అటువంటి పరిస్థితి ఈ ప్రభుత్వం లో ఉండదని కొత్తగా పేర్ల నమోదు చేసుకుని మత్స్యకారులకు భరోసా కల్పిస్తామని శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం రూరల్ మండలం కుందువాని పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణం, చేపడతామని తెలిపారు. అన్ని రకాలుగా మత్స్యకారుల గ్రామాలకు అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

అంబేద్కర్ జాతర జయప్రదం చేయండి

డి హెచ్‌పిఎస్

విశాలాంధ్ర -హిరమండలం: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుక లో భాగంగా ఏప్రిల్ 14వ న అంబేద్కర్ జాతర నిర్వహిస్తున్నాం అని ఈ కార్యక్రమం లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని దళితహక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి కోరారు . టెక్కలి లో అంబేద్కర్ జంక్షన్ వద్ద డిజె తీన్మార్ తో వంద డప్పులతో కోలాటంతో అంబేద్కర్ జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం మండలం లోని ఎమ్ ఎల్ పురం లో అంబేద్కర్ జాతర కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో డి హెచ్ పి ఎస్ నాయకులు సీడి వసంతరావు, ఆరంగి లింగమూర్తి, సీడి బాలకృష్ణ, వెంకటరమణ, సవరయ్య , ఉషారాణి, పత్రి సంతోష్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా సంతబొమ్మాళిని తీర్చిదిద్దుతా..

త్వరలో కోటబొమ్మాళి-సంతబొమ్మాళి రహదారి పనులకు శంకుస్థాపన

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండల కేంద్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చి దిద్దే బాధ్యత తాను తీసూకుంటాని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. సోమవారం సంతబొమ్మాళి లో ఉన్న గోదావరి పోలమ్మ ఆలయం పక్కన శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ శంకుస్థాపన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికత తనకెంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు. దివంగత మహానేత కింజరాపు ఎర్రన్నాయుడు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలే, ఆశీస్సులు మెండుగా ఉన్నాయని నమ్ముతున్నాని అన్నారు. దివంగత మహానేత నందమూరి తారక రామారావు 1987 మాండలిక వ్యవస్థను తీసుకొచ్చారన్న విషయాన్ని గుర్తు చేశారు. దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు కృషి ఫలితంగా సంతబొమ్మాళి ని మండల కేంద్రంగా ఏర్పాటు చేశారని తెలిపారు. కోటబొమ్మాళి నుంచి సంతబొమ్మాళి రహదారి పనులకు ఒకటి రెండు రోజుల్లో శంకుస్థాపన చేయడం జరుగుతుందని ప్రకటించారు. అదేవిధంగా నరసన్నపేట నుంచి వెంకటాపురం వరకు రూ.120 కోట్ల అంచనా వ్యయంతో రహదారి నిర్మాణ పనులు అతి త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. టెక్కలి నౌపడ, వడ్డివాడ రైల్వే వంతెన పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని, అందుకు అవసరమైన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగానే నియోజవర్గానికి 10 పదివేల సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయనుందని, ఇందులో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. పారిశ్రామిక హబ్ గా తీర్చిదిద్దేందుకు గాను 10 వేల ఎకరాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నార లోకేష్,కేంద్రం పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, సహకారంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడం జరుగుతుందని, మత్స్యకార భరోసా, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాన్ని కూడా అతి త్వరలోనే అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా అందరూ సమిష్టిగా ఉండి అభివృద్ధి పథంలో తీసుకువెళ్దామని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, సంతబొమ్మాళి మండలం టిడిపి అధ్యక్ష కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, మాజీ సర్పంచులు మెండ అప్పారావు, కూచెట్టి కాంతారావు, మాజీ జెడ్పిటిసి బడాన రమణమ్మ, నీటి సంఘం అధ్యక్షుడు పక్కి రమేష్, చల్ల జగ్గారావు తెలుగుదేశం పార్టీ నాయకులు శవాన ప్రసాదరావు, కూచెట్టి భాను ప్రకాష్, బెండి అరుణ్ కుమార్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోరికాన ఫౌండేషన్ కు ప్రభుత్వ ఉగాది పురస్కారం

విశాలాంధ్ర -కొత్తూరు: శ్రీకాకుళం జిల్లాకు చెందిన కోరికాన ఫౌండేషన్ కు ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ఉగాది పురస్కారం దక్కింది. శ్రీకాకుళం జిల్లాలో కొరి కాన. ఫౌండేషన్ ఎన్నో సామాజిక సేవలు ను అందిస్తుంది. ముఖ్యంగా పాతపట్నం శాసనసభ నియోజకవర్గం స్థాయిలో ప్రజల దాహార్తి ని తీర్చడానికి ట్యాంకర్లు తో తాగునీటి ని.గ్రామాల్లో సరఫరా సాగిస్తుంది. యువత కు ఉపాధి అవకాశాలను చూపిస్తుంది వీటిని గుర్తించిన రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది విశ్వావసు నామ ఉగాది ఉత్సవాలు లో కొరికాన ఫౌండేషన్ కు.పురష్కరం అందజేసింది. ఫౌండేషన్ నిర్వాహకురాలు. జనసేన. నాయుకరాలు కొరికాన భావానికి సిఎం బాబు పురస్కారం అంద జేసి శాలువ కప్పి సన్మానం చేశారు. కాగా ఈ ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పాతపట్నం నియోజక వర్గ ప్రజలకు మరింత సేవ చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.

రచనల ద్వారా సమసమాజంలో మార్పులు

విశాలాంధ్ర-పలాస: రచనలు, పాటలు ద్వారా సమాజంలో మార్పులు తీసుకురావచ్చని గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాలరావు అన్నారు. సోమవారం కలం గళం క్రియేషన్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్, రైల్వే గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో సమ సమాజ స్థాపన కోసం జరిగిన పాట చిత్రీకరణలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బోనెల గోపాల్, కలం నగిరి.కరుణాకర్ మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం పాటుబడిన మహనీయుల జీవిత చరిత్ర మరియు జన్మదినాలు.. గుర్తుచేస్తూ.. ప్రజల్లో చైతన్యం కోసం పాట చిత్రీకరిస్తున్నామన్నారు. ప్రజలందరూ ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్ట జోగారావు, ఎంఎంఎస్ జిల్లా కమిటీ అధ్యక్షులు గీతారాణి, ఉపాధ్యాయులు బోకర దుర్యోధన చెల్లూరు పద్మలోచన, సూర్యం, తెప్ప.పాపారావు, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేష్ పాల్గొన్నారు.

రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, బగ్గు

విశాలాంధ్ర -నరసన్నపేట: పట్టణంలో జామియా మసీదులో సోమవారం నిర్వహించిన రంజాన్ పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ సహనాన్ని, శాంతి, సామరస్యాలను, దాన, దయాగుణాలను, సోదర భావాన్ని మనలో పెంపొందించి, కొత్త ఉత్సాహాన్ని ఈ రంజాన్ పండుగ అందచేయాలని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం మౌలానా(గురువు), మహ్మమద్ ఫిరోజ్ షేక్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, రోణంకి కృష్ణం నాయుడు, వార్డు మెంబర్లు, బతకల సంతోషి, గొలివి రామారావు, టిడిపి నాయకులు, కింజరాపు రామారావు, పుచ్చల కల్పన, మల్ల భూలక్ష్మి, బతకల గోపి, మదీనా, మహమ్మద్ రఫీ, మహమ్మద్ ఆరీఫ్,తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ వర్తింపజేయాలి



విశాలాంధ్ర-ఎచ్చెర్ల: సర్వశిక్ష ప్రాజెక్ట్ పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లకు మినిమం టైమ్‌స్కేల్ (ఎంటీఎస్) వర్తింపజేయాలని పార్టై టైం ఇన్స్ట్రక్టర్ల జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలం చిలకపాలెంలో సోమవారం నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. గత 13 ఏళ్లుగా పనిచేస్తున్న పార్టైమ్ ఇన్స్ట్రక్టర్లను ఒకేషనల్ టీచర్లుగా గుర్తిం చాలన్నారు. అరకొర వేతనాలతో పనిచేస్తున్న తమకు ఎంటీఎస్ వర్తింపజేసి ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వై.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎల్. దిలీప్ కుమార్, కోశాధికారి తారకేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు...

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర-పోలాకి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేరుస్తారని స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు అని అన్నారు. మండల సిపి రోడ్డు కుసుమపోలవలస, పాతూరు, మునసబు పేట మీదుగా చీడివలస వరకు రూ.175 లక్షలతో 3200 మీటర్లు తారు రోడ్డు నిర్మాణానికి భూమి పూజచేసి, శంకుస్థాపన చేస్తారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటి నెరవేరుస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్లు ప్రజల పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించే దిశగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. అటువంటి కార్యక్రమంలో ఉగాది పర్వదినాన నేను పాల్గొనడం నాకు చాలా సంతృప్తి కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.

మృదంగ విద్వాంసుడు ప్రసాద్ కు ఉగాది పురస్కారం

సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రదానం



విశాలాంధ్ర-కవిటి: విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఉగాది వేడుకలు తెలుగు సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబించేలా రాష్ట్ర ప్రభుత్వ ఆధర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులు 86 మందికి కళారత్న,116 మందికి ఉగాది అవార్డులను సీఎం చంద్రబాబు ప్రదానం చేశారు. అందులో భాగంగా మండలంలోని కుసుంపురం గ్రామానికి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసులు, బనారస్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బొంతలకోటి సత్య వర ప్రసాద్ ను సీఎం చంద్రబాబు నాయుడు ఘనంగా సత్కరించి ఉగాది పురస్కారాన్ని అందజేశారు. ఇందుకుగాను కృషిచేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, జిల్లా మంత్రి అచ్చం నాయుడు, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యాంసుందర్ శివాజీ లకు కుసుంపురం గ్రామ పంచాయతీ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతూ ఉగాది పురస్కారం అవార్డు గ్రహీత సత్య వరప్రసాద్ కు అభినందనలు తెలిపారు.

మునిసిపాలిటీలో తాగునీటి సరఫరాకు నిధులు మంజూరు

ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్



విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో ఇంటిం టికి తాగునీటి సరఫరాకు గాను ప్రభుత్వం 68.8 కోట్లు నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే పి యుసి చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. పట్ట ణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు అర్బన్ వాటర్ సప్లై ఇంప్లిమెంట్ చేసేందుకు 68.8 కోట్ల రూపాయ లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ నిధుల తో పట్టణ ప్రాంతంలో తాగునీరు సరఫరా మెరుగు పరుచుటకు, శివారు ప్రాంతాలకు నీటి ఎద్దడి లేకుండా ఇంటింటికి తాగునీటిని సరఫరా చేయుట కు త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు వివ రించారు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఈ నిధులు ఎంతగానో దోహదపడతాయని తెలి పారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు లేకుం డా ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలి యజేశారు. నిధులు మంజూరుకు సహ కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్ అశోక్

విశాలాంధ్ర-సోంపేట: కొత్తగా ఏర్పాటైన సోంపేట బార్ అసోసియేషన్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోడ శైలేంద్ర శర్మ ఆధ్వర్యంలో కొత్తగా ఎన్నికైన అసోసియేషన్ ప్రతినిధులు, మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యేను కలిసారు. సోంపేట కోర్టు పరిసరాలు, బార్ అసోసియేషన్ తదితర మౌలిక సదుపాయాలు సంబంధించి సమస్యలను నివేదించారు. వాటిపై తప్పకుండా తగు చర్యలు తీసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. నూతన బార్ అసోసియేషన్ ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం లక్కివలస పంచాయతీ గద్దలపాడు గ్రామానికి చెందిన నుత్తు ఆదయ్యకు 72400 రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు సోమవారం అందజేశారు. వ్యాధివలన కుటుంబానికి ఆర్థిక భారం వలన అప్పులు చేసి వైద్యం చేసుకుంటున్నాడని గతంలో లక్కివలస పంచాయతీ సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు పిట్ట రాజులు మంత్రి అచ్చం నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మంత్రి అచ్చం నాయుడు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించి అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సీనియర్ నాయకులు పిట్ట రాజులు, వంశధార నీటి సంఘం అధ్యక్షుడు ఢిల్లీశ్వరరావు, పంచాయతీ టీడీపీ నాయకులు ఉన్నారు.

కాళింగులకు దరి చేరని నామినేటెడ్ పదవులు

అంతర్మథనంలో కళింగ సామాజిక వర్గం
యాదవ సామాజిక కులంకు కూడా మొండిచేయి..!

విశాలాంధ్ర-పలాస: పలాస నియోజకవర్గంలో కింతలి కాళింగుల ప్రభావం రోజురోజుకు తగ్గుతూ వస్తుందని ఆందోళన వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో ఈ సామాజిక వర్గం అధిపత్యం దశాబ్దాల కాలంగా కనుమరుగవుతూ వస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ నామినేటెడ్ పదవులు భర్తీ విషయంలో కొన్ని ప్రధాన సామాజిక వర్గాలను విస్మరించిన తీరుపై ఆయా సామాజిక వర్గాల్లో అసంతృప్తి వ్యక్తం అవుతుంది. ఇటీవల నామినేటెడ్ పదవులు నియామకంలో మూడో జాబితాలో కూడా ప్రధానంగా పలాస నియోజకవర్గంలో గణనీయంగా ఓటు బ్యాంకు కలిగిన కళింగ సామాజిక వర్గానికి కీలకమైన నామినేటెడ్ పదవులు దక్కకపోవడంపై ఆ సామాజిక వర్గానికి చెందిన పెద్దలు కూటమి ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది . జిల్లాలో ప్రధాన సామాజిక వర్గాలలో ఒకటైన కళింగ సామాజిక వర్గం ఒకప్పుడు జిల్లా రాజకీయాలలో కీలక పాత్ర పోషించిన పరిస్థితి ఉండేది. సుదీర్ఘ కాలం శ్రీకాకుళం పార్లమెంటరీ స్థానం నుంచి దివంగత నేతలు బొడ్డేపల్లి రాజగోపాలరావు,డాక్టర్ కె. విశ్వనాథం, హనుమంతు అప్పయ్య దొరలు ప్రాతినిధ్యం వహించారు. డాక్టర్ కిల్లి కృపారాణి పార్లమెంట్ సభ్యులుగా, కేంద్ర మంత్రిగా కొనసాగిన పరిస్థితి ఉండేది. అలాగే శాసన సభ్యులుగా హనుమంతు అప్పయ్య దొరతో పాటు మజ్జి తులసి దాస్, తమ్మినేని పాపారావు, పైడి నరసింహ అప్పారావు, కిల్లి అప్పలనాయుడు,పైడి శ్రీరామమూర్తి, హనుమంతు సత్యం దొర, రోనంకి ,బెండి లక్ష్మి నారాయణమ్మ,చౌదరి సత్యనారాయణ,బమ్మిడి నారాయణ స్వామి, మజ్జి నారాయణరావు, దువ్వాడ నాగవళి, డాక్టర్ కొర్ల రేవతిపతి, కొర్ల భారతి, మాజీ ఎమ్మెల్సీ మజ్జి శారద వీళ్లంతా కళింగ సామాజిక వర్గానికి చెందిన వారైనప్పటికీ ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహించారు. అలాగే జిల్లాలో ఇతర నియోజకవర్గాల నుంచి కూడా డాక్టర్ బెందాళం అశోక్, కూన రవికుమార్, తమ్మినేని సీతారాం, బొడ్డేపల్లి సత్యవతి, పైడి శ్రీరామ మూర్తి , సత్తారు లోకనాదం, చిగిలిపల్లి శ్యామలరావు, అట్టాడ జనార్దన రావు, రోణంకి సత్యనారాయణ, బెందాళం వెంకటేశ్వర శర్మ తదితరులు కూడా ఎమ్మెల్యేలుగా కళింగ సామాజిక వర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన వారే. గతం ఎంతో ఘన కీర్తి కలిగిన ఈ సామాజిక వర్గానికి కూటమి ప్రభుత్వంలో తగు రీతిలో రాజ్యాధికారంలో భాగస్వామ్యం దక్కడం లేదన్న విమర్శలు లేకపోలేదు. ఆముదాలవలస శాసనసభ్యులు కూన రవికుమార్ కు రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం కల్పించకపోవడం పట్ల ఆయా సామాజిక వర్గం పెద్దలంతా కూటమి సర్కార్ తీరుపై ఆగ్రహంగా ఉన్నారు. రాజకీయ చైతన్యం కలిగిన నియోజక వర్గాల్లో కీలకమైన పలాస నియోజకవర్గం విషయానికి వస్తే కళింగ సామాజిక వర్గానికి కనీసం కీలకమైన నామినేటెడ్ పదవులు ఇవ్వకపోవడం పట్ల కళింగ సామాజిక వర్గ పెద్దలు కలవర పడుతున్నారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి గంపగుత్తగా ఓట్లు వేసిన గాని తమ సామాజిక వర్గానికి తగు రీతిలో సముచిత స్థానం కల్పించకపోవడం పట్ల.. భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకునే పరిస్థితి లేకపోలేదని అంటున్నారు. వాస్తవానికి పలాస నియోజకవర్గంలో కింతలి కళింగ సామాజిక వర్గం ఓటు బ్యాంకు ఎక్కువగా ఉన్నప్పటికీ, బూరగాన కళింగ సామాజిక వర్గానికి చెందిన పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ వజ్జ బాబురావుకు రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారని, ఎంతో మంది కింతలి కళింగ సామాజిక వర్గానికి చెందిన నేతలు ఉన్నప్పటికీ వారు ఎవరికీ కీలక పదవులు ఇవ్వకుండా కాలక్షేపం చేస్తున్న అధిష్టానం తీరుపై వాళ్లంతా లోలోపున మదన పడుతున్నట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పదవులు గాని, ఇతర స్థానిక సంస్థల పదవులు గాని కళింగ సామాజిక వర్గానికి చెందిన వారికి ఇస్తామని ఇంత వరకు అధిష్టానం భరోసా ఇవ్వకపోవడం పట్ల వీళ్లంతా ఆందోళన చెందుతున్నారు. నామినేటెడ్ పదవులు రేసులో సీనియర్ రాజకీయ నేతలకు మూడవ జాబితాలో కూడా నామినేటెడ్ పదవి దక్కలేదు.పలాస నియోజకవర్గంలో ఒక చరిత్ర గల కుటుంబం లక్ష్మీపురంనకు చెందిన దువ్వాడ కుటుంబం. ఆ కుటుంబం నుండి తొలి తరానికి చెందిన మొట్టమొదటి జిల్లా పరిషత్ చైర్మన్ మాజీ శాసన సభ్యురాలు దువ్వాడ నాగావళి తండ్రి బెండి కూర్మన్న, ఆమె తల్లి అప్పటి బ్రాహ్మణతర్ల నియోజకవర్గం నుండి శాసనసభ్యురాలు. ఆమె భర్త దువ్వాడ కృష్ణమూర్తి నాయుడు పలాస సమితి మాజీ అధ్యక్షులుగా వ్యవహరించారు. ఇంతటి చారిత్రాత్మక నేపథ్యం ఉన్న ఆ కుటుంబానికి ఇంత వరకు కూటమి ప్రభుత్వం గుర్తించి గౌరవించినట్టు లేదు. దివంగత అప్పయ్య దొర పెద్ద కుమారుడు మురళీమోహన్ దొర, కోడలు న్యాయవాది రాణి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేర్పించి చివరకు వారికి ఒక మున్సిపల్ వార్డులో ఇంచార్జి గానే కొనసాగిస్తున్నారు. మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు పై కినుక వహించి,అలకపూని తెలుగుదేశం వైపు వెళ్లిన నాయకులకు నేటికీ పరిస్థితి నిరాశాజనకంగానే ఉంది. పలాస నియోజకవర్గంలో కాళింగ కులం తరువాత ఎక్కువ శాతం ఓటు బ్యాంకు గల యాదవ కులంకు చెందిన నాయకులకు కూడా తగిన ప్రాధాన్యత కల్పించడం లేదనే చర్చ జరుగుతోంది. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ సంబంధించి సీనియర్ టిడిపి నాయకులు లోడగల కామేశ్వరరావు యాదవ్ కు నామినేటెడ్ పదవుల పందేరంలో చోటు దక్కకపోవడంతో ఆ సామాజిక వర్గంలో కూడా జోరుగా చర్చ జరుగుతుంది. పార్టీ కష్ట కాలంలో టిడిపి అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు అనేక కార్యక్రమాలు చేపట్టి పార్టీని నిలబెట్టుకుని వచ్చారని యాదవ కులానికి చెందిన కొందరు చేరుకుంటున్నారు. తనకు ఏ పదవులు లేకపోయినా ప్రస్తుతం కూడా పార్టీకి విధేయుడై పనిచేస్తుండడం పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత తెలియజేస్తోంది. కూటమిలో భాగస్వామ్యమైన బిజెపి జనసేన పార్టీ నాయకులు కూడా నామినేటెడ్ పదవులను ఆశిస్తూ వస్తున్నారు. వీరందరికీ అధిష్టాన వర్గం ఏ విధంగా సంతృప్తి పరుస్తుందో కాలమే నిర్ణయిస్తుందని పలువురు అంటున్నారు. పలాస కాశీబుగ్గ మాజీ మున్సిపల్ చైర్మన్, జనసేన నాయకులు కోత పూర్ణచంద్రరావు కూటమి పార్టీలో ఉన్న ఆయన పట్ల పొత్తు ధర్మం పాటించడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే విధంగా మిగతా ప్రాధాన్యత క్రమ సామాజిక వర్గాలకు కూడా తగు రీతిలో సముచిత స్థానం కల్పించాలని ఆయా సామాజిక వర్గ పెద్దలు కూటమి పెద్దలను విజ్ఞప్తి చేస్తున్నారు. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారు రోజు రోజుకు ఎక్కువ అవుతుండడంతో అధిష్టాన వర్గం ఏ మేరకు ఎవరెవరికి న్యాయం చేస్తుందో వేచి చూద్దాం...!

గాయపడిన కార్యకర్తకు అండగా పరామర్శించిన ఎమ్మెల్యే శిరీష

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: విద్యుదాఘాతానికి గురైన టీడీపీ కార్యకర్త జానకిరావును సోమవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పరామర్శించి అండగా ఉంటామని స్పష్టం చేశారు. వజ్రపుకొత్తూరు మండలం, కొత్తపేట గ్రామంలోని జానకిరావు నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే శిరీష పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. జరిగిన ఘటనపై ఎమ్మెల్యే చింతిస్తూ త్వరగా ఆయన కోలుకోవాలని ఆకాంక్షించారు. కష్టాల్లో ఉన్న ప్రతి టీడీపీ కుటుంబ సభ్యునికి పార్టీ అండగా ఉంటుందన్నారు. జానకిరావుకి జరిగిన ఘటన దురదృష్టకరమని ఆయన ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన కుటుంబానికి భరోసానిచ్చారు. ఆమె వెంట టీడీపీ నాయకులు మల్ల సూర్యం,పుచ్చ ఈశ్వరరావు, గోవిందు పాపారావు, బైపల్లి నారాయణ, కంబాల రాంబాబు, చింతా నారాయణ, దుర్రు నారాయణస్వామి తదితరులున్నారు.

ఎట్టకేలకు విద్యుత్ సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర-సోంపేట: ఈ మండలం గొల్లగండి పంచాయతీలోని పలు గ్రామాల్లో నెలకొన్న తీవ్రమైన విద్యుత్ సమస్యలకు సంబంధిత అధికారులు ఎట్టకేలకు పరిష్కారం చూపారు. ఆయా గ్రామాల్లో సమస్యలను స్థానిక జనసేన నేత, మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ గందువల్లి చినరాజారావు, ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్, జనసేన సమన్వయకర్త దాసరి రాజుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. వారి ఆదేశాల మేరకు సోంపేట అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.రామారావు సిబ్బందితో పలు రోజులుగా గొల్లగండి పంచాయతీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించారు. సోమవారంతో విద్యుత్ పనులు పూర్తికావడంతో చిన్నరాజారావు ఏఈఈ రామారావుతో పాటు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొరికానకు పురస్కారంపై హర్షం

విశాలాంధ్ర-మెళియాపుట్టి: ప్రతినిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టనష్టాలలో భాగస్వామ్యమౌతూ వివిధ రకాల సేవలు అందించిన పలువురుకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది సందర్భంగా అందించిన పురస్కారాలలో భాగంగా శ్రీకాకుళం జిల్లా, పాతపట్నం నియోజకవర్గానికి చెందిన జనసేనపార్టీ నాయకురాలు కోరికాన భవానీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పురస్కారం అందించారు. ఫౌండేషన్ ద్వారా వివిధ సేవలను పాతపట్నం నియోజక వర్గములో జనసేన పార్టీ నాయకురాలు కొరికాన భవనీకి అందిస్తు సేవా కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సేవా పురస్కారాన్ని రాష్ట్రంలో పలువురికి అందజేసే కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం తమ జనసేన పార్టీ నాయకురాలు భవానికి రావడం పట్ల ఆ పార్టీ నాయకులు దుక్క బాలరాజు, చంటి, తిరునగరి ప్రసాద్, ఈశ్వరరావు, హరికృష్ణ, ప్రశాంత్, కిరణ్, భరత్, జనసేనపార్టీ నాయకులు, వీరమహిళలు, జనసైనికులు, యువకులు తదితరులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

నులిపురుగుల నివారణ మందులు పంపిణీ

విశాలాంధ్ర-టెక్కలి: గొర్రెలకు సంబంధించి నులిపురుగుల నివారణ మందులు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందని ఆంధ్రప్రదేశ్ యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు యాదవ్ అన్నారు. సోమవారం రావివలస పంచాయతీ చిన్న నారాయణపురం గ్రామంలో ఉన్న గొర్రెల పెంపక రైతులకు నులిపురుగుల నివారణ కోసం అవగాహన కల్పిస్తూ ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవాలు పెంపకం చేస్తున్న రైతులు పట్ల కూటమి ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. గొర్రెలు పెంచుతున్న రైతులు ప్రతి ఒక్కరూ కూడా నులి పురుగులు నివారణ పై అవగాహన కలిగి ఉండాలని, 10 కేజీల ఉన్న గొర్రెలకు 2 నుండి 3 ఎంఎల్ పట్టాలని, 15 కేజీల పైగా ఉన్న గొర్రెలకు 5 ఎంఎల్ పట్టాలని రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు దీనిపై పూర్తి అవగాహన లేకపోవడంతో అధిక డోస్ పట్టడం వల్ల గొర్రెలు తట్టుకోలేక మృతి చెందుతున్నట్టు తెలియజేశారు. గొర్రెలు పెంచుతున్న రైతులు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత మందులను తీసుకోవాలని, వీటి వివరాలను సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ లేదా అధికారులకు అడిగి తెలుసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జగదీశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ పూర్ణచంద్రరావు, వెటర్నరీ అసిస్టెంట్ నూతన్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

- ప్రతి మహిళ మొబైల్ ఫోన్లో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

విశాలాంధ్ర - టెక్కలి: మహిళ భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్ అందుబాటులోకి తీసుకువచ్చింది. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలు పాఠశాలల, కళాశాలలో శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఎంజెపిఏపిబిసిడబ్ల్యు (ఎంజెపి) బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు శక్తి పోలీస్ బృందం ఎస్ఐ వి బాలకృష్ణ ఆధ్వర్యంలో శక్తి యాప్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శక్తి యాప్ మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందని, విద్యా, ఉద్యోగం, ఉపాధి ఇతర పనులు కోసం బయటకు వెళ్లే మహిళలు తమ ఇళ్లకు సురక్షితంగా చేరుకునేలా శక్తి యాప్ ను రూపొందించింది అని అన్నారు. ఫిర్యాదుల పరిస్థితిని సులభతరం చేసి మహిళలకు రక్షణ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసిందని, ఇకపై ప్రతి మహిళ ఓ శక్తిగా మారేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో ఈ యాప్ ను సిద్ధం చేసిందన్నారు. మహిళలు ఫోన్లో ఈ యాప్ను డౌన్లోడ్ చేసుకుని ఎటువంటి ఆపద వచ్చిన దీని ద్వారా పోలీసులకు సమాచారం అందిస్తే చాలు తక్షణమే వారు అక్కడకు చేరుకొని రక్షణ కల్పిస్తారని తెలిపారు. ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా తమ మొబైల్ ఫోన్లో శక్తి యాప్ ని డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం స్వీయ రక్షణ పై టైక్వాండో కోచ్ నర్సిపురం శేఖర్ బాలికలకు స్వీయ రక్షణ ఏ విధంగా చేయాలో విద్యార్థులతో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో శక్తి పోలీస్ సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపల్ సుధారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ఆలయ ప్రాంగణంలో ఉగాది సంబరాలు

విశాలాంధ్ర-కొత్తూరు: శ్రీ విశ్వావసు నామ నూతన సంవత్సర తొలి రోజున ఉగాది రోజున. వైస్ ఎంపీపీ లోతుగెద్ద తులసీ వర ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు కొత్తూరులో ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రచయతలు మరియు కవులు వారి యొక్క రచనలు, కవితలు చెప్పారు.ఆర్టిస్టులు వారి నటన నైపుణ్యం చూపించారు.మిమిక్రీ ఆర్టిస్టులు మిమిక్రీ చేసారు.అనంతరం మెట్టూరు హై స్కూల్ విద్యార్థునులచే భరత నాట్యం చేయడం జరిగింది. గాయకులు ఉగాది పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ లోతుగెద్ద తులసీ వర ప్రసాద్ రావు ఉగాది శుభకాంక్షలు తెలపడమే కాకుండా ఆయన మాట్లాడుతూ ఈ ఉగాది రోజు నుండి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. అలాగే ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉగాది ఎలా జరుపుకుంటారు, ఎందుకు జరుపుకుంటారో తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంతోమంది వక్తలు ఉగాది గురించి తెలిపారు.అనంతరం ఈ కార్యక్రమంలో లోతుగెద్ద తులసీ వర ప్రసాద్ రావు మరియు లోతుగెద్ద లక్ష్మీ నారాయణ నాయుడు చేతుల మీదుగా కవులు, రచయతలను గౌరవంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రచయితలు,కవులు, ప్రభుత్వ ఉద్యోగులు,ప్రజా ప్రతినిధులు, యువకులు, మీడియా ప్రతినిధులు మొదలగు వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వెంకటరావుకు అభినందనలు

విశాలాంధ్ర-కవిటి: విశాఖపట్నంకు చెందిన ప్రముఖ ఏ గ్రేడ్ మృదంగ విద్వాంసులు గుంటుకు వెంకటరావు కి సంగీత విభాగంలో 2024-25 సంవత్సరంలో ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. విజయవాడలో ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం. అశోక్, ఉద్దానం సంగీత కళాకారులు, రాజకీయ ప్రముఖులు, ఆయన శిష్యులు వెంకటరావుగారిని అభినందించారు.రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా నేతింటి

విశాలాంధ్ర-టెక్కలి: మండలం అక్కవరం పంచాయతీ విక్రంపురం గ్రామంకి చెందిన నేతింటే రాజారావు ని బీజేపీ పార్టీ ఆదేశాల మేరకు టెక్కలి మండల ప్రధాన కార్యదర్శిగా మండలం అధ్యక్షులు, జిల్లా మోర్చా అధ్యక్షులు సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నేతింటే రాజారావు మాట్లాడుతూ మండలం నాయకులు అందరితో కలిసి పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు జార్జన రాంజీ, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు బూరే నరేంద్ర చక్రవర్తి ,ఎస్టి మోర్చ జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు పినిమింటి ఉమాబాబు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం పేరుతో రెల్లి కులాలకు అన్యాయం

నరసన్నపేట రెల్లి సంఘం అధ్యక్షులు, బెవర రాము

విశాలాంధ్ర-నరసన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక న్యాయం పేరుతో రాష్ట్రంలోని రెల్లి కులాలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నాయని నరసన్నపేట రెల్లి సంఘం అధ్యక్షులు, బెవర రాము విమర్శించారు. సోమవారం నరసన్నపేట, టెక్కలి పట్టణాల్లో రెల్లి కుల సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో బెవర రాము మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి నేటికి 78సంవత్సరాలు అవుతున్నా రెల్లి కులాలకు చెందిన యువతీ, యువకులకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం ఎటువంటి ప్రాధాన్యత కల్పించటం లేదని దుయ్యబట్టారు. మనలో అంటరాని వాళ్ళుగా పిలవబడుతున్న 56 ఉప కులాల వారికి రాజ్యాంగం ఆర్టికల్-341 ప్రకారం 15శాతం రిజర్వేషన్ కల్పిస్తే, 1997వ సంవత్సరంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, చంద్రబాబునాయుడు ఏ.బి.సి.డి గ్రూపులుగా విడదీసి, మన కులం వారికి ఏ గ్రూప్‌లో పెట్టి 1శాతం రిజర్వేషన్ కల్పించటం జరిగిందన్నారు. అయితే ఈ 1శాతం కూడా రోస్టర్ పాయింట్ వలన మహిళలకు వెళ్తుందని, ఆ సమయంలో మహిళ ఉద్యోగానికి అర్హత లేని పక్షంలో మరలా బి గ్రూప్‌కు వెళ్ళిపోతుందని తెలిపారు. ఈ విధంగా చూస్తే రెల్లి గ్రూపుకు చెందిన కులాలకు ఎటువంటి రిజర్వేషన్లు వర్తించటం లేదన్నారు. అనంతరం రెల్లి కుల సంఘం ప్రతినిధి, సుధాకర్ మాస్టార్ మాట్లాడుతూ 2004వ సంవత్సరంలో వర్గీకరణ జీఓ రద్దు చేస్తూ, సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అలాగే ప్రస్తుత ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు మన భావితరాల భవిష్యత్తుపై ఉక్కు పాదం మోపుతున్నారని, ఈ చర్యలపై మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కొత్తూరు రెల్లి సంఘం ప్రతినిధి, దూలి మోహనరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి మాయొక్క డిమాండ్స్ తెలియచేస్తున్నామని దీనిలో ఎస్సీల వర్గీకరణ జరిపితే ముందుగా కులగణన జరగాలని, జిల్లాల వారీగా జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని అమలు చేయాలని కోరారు. అలాగే రిజర్వేషన్ శాతాన్ని కాకుండా అదనంగా ఒక శాతం పెంచాలన్నారు. అలాగే శ్రీకాకుళం రెల్లి సంఘం ప్రతినిధి, అర్జి కోటి మాట్లాడుతూ రెల్లి గ్రూపు కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, 2004లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని, కులగణన చేసి, జిల్లా, జోన్ వారీలుగా వర్గీకరణ చేయాలన్నారు.

శ్రీ సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు

విశాలాంధ్ర-రణస్థలం: మండలం కోస్ట పంచాయతీలో వెలసిన శ్రీ సీతారాముల కల్యాణానికి ఘనంగా ఏర్పాట్లు నిర్వహించారు . ఇందులో భాగంగా ఉగాది పర్వదినం ఆదివారం ఉదయం 9 గంటలకు కళ్యాణరాటను టిడిపి సీనియర్ నాయకులు పిసిని జగన్నాథం నాయుడు దంపతులు ఆధ్వర్యంలో చేపట్టారు . శ్రీరామనవమి నాడు ఉదయం 10 గంటలకు కళ్యాణం, మధ్యాహ్నం మహన్నదాన సమారాధన, సాయంత్రం పట్టాభిషేకం అనంతరం ఉత్సవమూర్తులు ఊరేగింపు ఉంటుందని ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యుడు టీడిపి యువ నాయకులు పిసిని హరికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ పిసిని అసిరి నాయుడు, ఎక్స్ ఎంపీటీసీ పైడి అప్పుడుదొర, పిసిని హరికృష్ణ మరియు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులకు అండగా శ్రీధర్

విశాలాంధ్ర-హిరమండలం: ఉగాది పండగ సందర్భంగా ఆదివారం హిర మండలం మేజర్ పంచాయతీకి చెందిన ఎంజీఆర్ యువసేన అధ్యక్షుడు పోతు రాజు శ్రీధర్ 23 మంది హిర మండలంనకు చెందిన నాయీ బ్రాహ్మనులకు రూ 1999 విలువ గల కిట్లు ను అంద జేసినట్లు విలేకరుల కు ఆదివారం మధ్యాహ్నం విలేకరుల గ్రూపులో ఫార్వర్డ్ చేశారు. ఈసందర్భంగా శ్రీధర్ తెలుపుతూ నాయీ బ్రాహణుల కష్టసుఖాలు లో పాలు పంచు కుంటా నని ఏ సమస్య వచ్చిన నాకు తెలియజేయాలనీ అన్న ట్లు భోగట నాయీబ్రాహ్మణ లుకు ఉగాది మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి వారి తో కలిసి భోజనం చేసినట్లు విలేకరుల గ్రూపులో తెలిపిన శ్రీధర్.

మెరైన్ పోలీస్‌ల ఆధ్వర్యంలో చలివేంద్రం

విశాలాంధ్ర-సోంపేట: ఈ మండలం బారువ బీచ్ సమీపంలో మెరైన్ పోలీస్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ డీవిజే రమేష్‌కుమార్ చలివేంద్రాన్ని ప్రారంభించే బీచ్‌కు వచ్చే సందర్శకులకు చల్లని మజ్జిగను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసరావు, శిరీష, ఎఎస్సై కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-సోంపేట: ఈ మండలం జింకిభద్ర, బెంకిలి జంట గ్రామాల జనసేన పార్టీ కార్యకర్తలు, సోంపేట బారువ రోడ్డు జంక్షన్‌లో ఎండల తీవ్రత దృష్ట్యా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డొక్కా సీతమ్మ చలివేంద్రం ద్వారా బాటసారులకు ప్రతిరోజు చల్లని తాగునీరు, చిక్కటి మజ్జిగ అందజేస్తామని మాజీ టీడీపీ ఎంపీటీసీ పురుషోత్తం, జనసైనికులు గుజ్జల శంకరరావు, వెంకట్, విక్కి సునీల్, శరత్, తదితరులు పేర్కొన్నారు.

చిన్నారుల నృత్య ప్రదర్శన

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట, పలాసకు చెందిన చిన్నారులు ఉగాది సందర్భంగా హైదరాబాద్‌లోని శ్రీవెంకటేశ్వర ఆలయంలో ప్రదర్శించిన కూచిపూడి నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. సోంపేటకు చెందిన నృత్యకళాకారిణి బిందుమాధవి ఆధ్వర్యంలో శ్రీనటరాజ నాట్యమండలి చిన్నారులు వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రదర్శించిన నృత్యాలకు విశేష ఆదరణ లభించిందిఈ సందర్భంగా నృత్య గురువులతోపాటు చిన్నారులు స్నేహ, మనస్విని, లలిత, లాసిన్, హేమప్రియ, పల్లవి, చరిస్మా, చిన్మయి, తదితరులను దేవాలయం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి కార్యక్రమ ప్రతినిధి నరేంద్రయాదవ్ చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు.

సేవామూర్తికి ఘన సన్మానం

విశాలాంధ్ర-కవిటి: సేవామూర్తిగా నిరంతరం సామాజిక సేవలకు ఎంతో మంది ప్రశంసలు అందుకుంటున్న రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు, ఎస్ఎస్ సేవాఫౌండేషన్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావును కవిటి మేజర్ పంచాయతీ గొండ్యాలపుట్టుగ గ్రామంలో శ్రీగణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా ఘనంగా సన్మానించారు. సోంపేటతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలకు తరచూ తనదైన రీతిలో సేవలందిస్తున్న దుద్ది శ్రీనివాస్‌ను విశేషంగా ప్రశంసిస్తూ సన్మాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గొండ్యాలపుట్టుగ గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర

విశాలాంధ్ర-కవిటి: మండల కేంద్రమైన కవిటిలో శ్రీ చింతామణి సొండి కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సొండికుల సంక్షేమ సంఘ సభ్యులు గ్రామంలో ఘటాలతో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు.అనంతరం కవిటి శివాలయంలో శివునికి అభిషేకం,శ్రీ చింతామణి అమ్మవారి కి ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ చింతామణి సొండి కుల సంక్షేమ సంఘం సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకూ స్టూడెంట్ కిట్స్

నేటి నుంచి కళాశాల తరగతుల ప్రారంభం

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తిచేసి ద్వితీయ సంవత్సరంలో ఉన్న విద్యార్థులు ఏప్రిల్ 1వ తేదీ నుండి హాజరు కావలసి ఉంది. ప్రభుత్వం విద్యా విధానంలో మార్పును తెచ్చేందుకు ఇంటర్మీడియట్ తరగతులను మంగళవారం నుంచి ప్రారంభించేందుకు ఇప్పటికే అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ఆముదాలవలస నియోజకవర్గ పరిధిలో ఐదు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అలాగే పొందూరు ఆముదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, తొ గరాం లలో ప్రభుత్వ జూని యర్ కళాశాలలో ఉన్నాయి. అలాగే పొందూరు, ఆముదాలవలస, బూర్జ మండలాల్లో కేజీబీవీ పాఠశాలలో ఎక్స్టెన్షన్ ఇంటర్మీడియట్ కళాశాల లు ఉన్నాయి. అంతే కాకుండా మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే కళాశాల ఆముదాలవలస లో ఉంది. పొందూరు మోవిపేటలో మోడల్ కళాశాల ఉంది. హైస్కూల్ ప్లస్ రొట్టవలస కేంద్రంగా ఉంది. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో మరో రెండు కళా శాలలు ఉన్నాయి. వీటికి తోడు నియోజకవర్గ పరిధిలో నాలుగు ప్రైవేటు కళాశాలలో ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో ఉన్న సెకండ్ ఇయర్ విద్యార్థులు ఇటీవల జరిగిన పరీక్షలలో రిలీవ్ అయ్యారు. ప్రస్తుతం ఫస్ట్ ఇయర్ విద్యార్థులు సెకండ్ ఇయర్ కి ప్రమోట్ చేసే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తరగతులు నిర్వహించనున్నారు. అంతేకా కుండా వీరికి పాఠశాల విద్యార్థులకు అందించే అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పించినది. ఇప్పటికే వీరికి సంబంధించిన దుస్తులు, షూ, బ్యాగు, నోట్ పుస్తకాలు ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. గత ఏడాది వీరికి నోట్ పుస్తకాలతో పాటు మధ్యా హ్నం భోజనాన్ని కూడా ప్రభుత్వం కల్పించింది. ఈ ఏడాది మరికొన్నింటిని అందించేందుకు విద్యాశాఖ సర్వ శిక్ష అభియాన్ కు మెటీరియల్ తరలించారు. వీరి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గోదాములు ఏర్పాటు చేసి విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. మొదటి సంవత్సరం వచ్చే విద్య సంవత్సరానికి ప్రవేశం చేసిన వారికి కూడా ప్రభుత్వం ఈ కిట్టు అందించనుంది.

తెలుగు సంస్కృతి, జానపద కళలను పరిరక్షించాలి

ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: తెలుగు సంస్కృతి, జానపద కళారూపాలను పరిరక్షించు కోవాల్సిన గురుతర బాధ్యత సమాజంపై ఉందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు.అరసవల్లిలోని మణిపాత్రుని క్రియేటివ్ అకాడమీ క్యాంపస్ లో ఆదివారం నిర్వహించిన ఉదయ భాస్కర్ ఉగాది రాష్ట్ర పురస్కార ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. జానపద కళలు సంగీతము చిత్రలేఖనము వాయిద్యాలలో శిక్షణ అందిస్తున్న ఎంసీఏ అకాడమీ సేవలు అద్భుతమని అన్నారు. ఉగాది సందర్భంగా వివిధ కళల్లో కృషి చేస్తున్న రచయితలకు, అవార్డులు ఇవ్వడం స్వాగత పరిణామమని అన్నారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న విశ్రాంత డి.ఇ.వో బలివాడ మల్లేశ్వరరావు ఎం.సి.ఎ అకాడమీ సేవలను ప్రశంసించారు.ముఖ్య అతిథి ఎమ్మెల్యే గొండు శంకర్ వివిధ రంగాల్లో నిష్ణాతులైనవారికి సన్మానించారు.గ్రామ నామాల పరిశోధనా విభాగంలో వాండ్రంగి కొండలరావు, జానపద సాహిత్యంలో భగవాను దాసును, జానపద కళాశాహిత్యంలో బద్రి కూర్మా రావును, నాటక రంగంలో ఎరపాటి అప్పారావు, గానంలో నేరెళ్ల సత్యనారాయణ, హరికథా విభాగంలో వడగ బాలసుబ్రమణ్యం, డోలక్ వాద్యంలో లక్ష్మణరావు , వైద్యంలో ఇంజరాపు మోహన్ రావు , యువసేవలో వేపారి శ్రీనివాస్,నాట్యంలో కంటూ మురళి గోవింద్ సేవ రత్న పురస్కారమిచ్చి, ఘనంగా సన్మానించి గౌరవించారు, బాలరంజని విభాగంలో ఉత్తమ బాలలకు బాలరత్న బిరుదునిచ్చి సత్కరించారు. వీరిలో ఎల్లినాటి ధరణి, ఎం లిపి శ్రీవల్లి, ఎం జయదేవ కుమార్, బి సన్నిహిత్, శ్రీకాకుళం చిట్టి, బిన్నాడ దీక్షితులకు బాల రత్న పురస్కారమిచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావ్ మాస్టర్, యోగానంద్, బాల రంజని రాష్ట్ర కార్యదర్శి డబ్బీరు గోవిందరావు, ఎంసీఏ అధినేత్రి ఎం భాగ్యలక్ష్మి శ్రావణి, కార్యదర్శి ఎం టి వి ఆర్ మూర్తి, ఫౌండర్ ప్రెసిడెంట్ మణిపాత్రుని నాగేశ్వర రావు లు పాల్గొన్నారు.ఇదే వేదికపై జానపద సాహిత్యవేత్త బద్రి కూర్మారావు తాను సంపాదకత్వం వహించి ప్రచురించిన "ఉద్దానం కిడ్నీ విషాదాలు"పుస్తకాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ కు అందజేశారు.

ప్రజల కోసం పనిచేసే పార్టీ.. టిడిపి

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నరసన్నపేట: రాష్ట్రంలో ప్రజల కోసం పనిచేసే పార్టీ..తెలుగుదేశం పార్టీ అని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం మండలంలో ఉర్లాం గ్రామంలో టిడిపి సభ్యత్వ కార్డులను పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, రమణమూర్తి మాట్లాడుతూ టిడిపి శ్రేణులకు సభ్యత్వం కార్డులే అసలైన గుర్తింపునిస్తాయన్నారు. అలాగే ఈ సభ్యత్వం కార్డులను జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్ళి, పంపిణీ చేయాలన్నారు. సభ్యత్వం తీసుకున్న టిడిపి నాయకులకు, కార్యకర్తలకు ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.5లక్షలు భీమా వర్తిస్తుందని తెలిపారు. అనంతరం నియోజవర్గ ఇంఛార్జ్, బగ్గు అర్చన మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్ట్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబాల పిల్లలకు ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుందని, ట్రస్ట్ ద్వారా నాణ్యమైన విద్య అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, శిమ్మ చంద్రశేఖర్, అడపా చంద్రశేఖర్, జల్లు చంద్రమౌళి, కన్నేపల్లి ప్రసాద్, పూతి రమణ, రావాడ కృష్ణ, చమళ్ళ వామనమూర్తి, యగళ్ళ విజయ్, దుల్ల ఆనంద్, రావాడ జల్లు చంద్రమౌళి, కొల్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఉత్సవాల లో ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: శ్రీకాకుళం పట్టణంలోని జామియా మసీదు, సింగపురంలోని ప్రముఖ మసీదుల్లో ముస్లిం సోదరులు రంజాన్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థన చేశారు ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నెలరోజుల పాటు ఎంతో కఠోర దీక్షతో ఉపవాసాలు చేసి రంజాన్ వేడుకలను జరుపుకోవడం ఎంతో విశేషమని, ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. శాంతి సౌభ్రాతత్వం, ఐకమత్యం ఒకరికొకరు అనురాగాలు పంచుకోవడం ముస్లిం సోదరులు వారి స్నేహభావం ఎంతో గొప్పదని, ముస్లిం సోదరులు అంటే ఎంతో గౌరవం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శిష్టకరణాలకు కార్పొరేషన్ పదవి ఇవ్వండి

మంత్రికి వినతిపత్రం సమర్పించిన సంఘ ప్రతినిధులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: త్వరలో వెల్లడించనున్న శిష్టకరణ కార్పోరేషన్ చైర్మన్ ను ఉత్తరాంధ్ర కే కేటాయించాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ను పలు వురు సంఘ ప్రతినిధులు , టీడీపీ నేతలు కోరారు. సోమవారం మండలంలోని నిమ్మాడలో గల మంత్రి క్యాంపు కార్యాలయంలో శిష్టకరణ అసోషియేషన్ సంఘ ప్రతినిధులు , టీడీపీ శ్రేణులు కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉత్త రాంధ్ర జిల్లా లోనే అత్యధిక ంగా శిష్టకరణ సామాజిక వర్గం ఉందంటు గతంలో పరిణామాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మరికొందరు రాజాం పట్టణంలో టీడీపీ సీనియర్ కుటుంబానికి చెందిన ఉరిటీ సురేంద్ర కుమార్ అన్ని విధాలుగా అర్హుడైనందున కార్పోరేషన్ చైర్మెన్ గా ఆయనకు ఇవ్వడం మా అందరికీ సమ్మతేనని ఈ సంధర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ను కోరారు. సురేంద్రకుమార్ వైసీపీ హాయాంలో ఎదుర్కొన్న కేసులు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. ఆయన తండ్రి పార్టీ కి అందించిన సేవలు చంద్రబాబు నాయుడుకు తెలుసన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, కోటబొమ్మాళి మండలి అధ్యక్ష కార్యదర్శులు బెహర రాజేష్ ,సూర్య చైతన్య ,రాజాం సంఘ ప్రతినిధులు పక్కివాసు ,కుప్పిలి సాయిరమేష్ ,అప్పలనరసయ్య ,రాజాం పట్టణ టీడీపీ ఉపాఅధ్యక్షుడు,క్లస్టర్ ఇన్‌చార్జ్ ఉరిటి సురేంద్రకుమార్ తదితరులు కలిసి న వారిలో ఉన్నారు.

పైపులైను మరమ్మతుల పేరుతో తవ్వుతున్న రోడ్లు

- ప్రజాధనం వృధా - వృధా అవుతున్న తాగునీరు
- మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం

వరదవారి కోటర్స్ వద్ద పైప్ లైన్ మరమ్మతుకు తవ్వుతున్న రోడ్డు

విశాలాంధ్ర-ఆమదాలవలస: మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పైపు లైన్లు తాగు నీరు వృధా అవుతుంది. అధికారుల అనాలోచిత నిర్ణయాలు పాలకుల నిర్లక్ష్యం వెరసి నిరంతరం రోడ్లు గోతుల మయమై ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారి మార్గంలో పురాతన కాలమనాటి పైపు లైన్లు ఉండడంతో నిరంతరం లీకులు ఏర్పడి తాగు నీరు వృధా అవుతుంది. అంతేకాకుండా వేసవి కి ముందే వార్డుల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. పొడుగు చేతుల వారు వేసుకున్న మోటార్ల కార ణంగా దిగువ ప్రాంతాలకు తాగునీరు అందడం లేదు. అలాగే సమితులనాటి పైపులు కావడంతో వాటర్ ఫోర్స్ కు పైపులైన్లు లీక్ అవుతున్నాయి. నిరంతరం రోడ్లు తవ్వుతూ పైపులు మర మత్తు చేయటంతో ప్రజాధనం వృధా అవుతుంది. పైపు లైన్లు మరమ్మత్తుల పేరిట లక్ష రూపాయలు బిల్లు లు చెల్లిస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే రవికుమార్ మున్సిపల్ సమీక్షలో కూడా ఈ విషయాన్ని లేవ నెత్తారు. అయినప్పటికీ పరిష్కార మార్గాన్ని అన్వే షించకుండా అధికారులు మామూళ్లకు కక్కుర్తి పడి ఎప్పటికప్పుడు పైపులు మరమ్మతులు చేప దుతున్నారు. ఇటీవల ప్రధాన రహదారికి పాలపో లమ్మ గుడి, లక్ష్మీ నగర్ వీధి, వన్ వే ప్రాంతాల్లో రహదారిని గోతులమయం చేశారు. ఇప్పుడు వర దా వారి క్వార్టర్స్ లో గోతులు తవ్వడం మొదలుపె ట్టారు. ఒకరోజు మీరు రాకుంటే అధికార పార్టీ వద్ద మొరపెట్టుకున్న స్థానిక నాయకులు మోటార్లు విని యోగించిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోమని అదే పాలకుల వద్ద చెప్పడం లేదనేది మునిసిపల్ ప్రజల ఆవేదన. పాలకులు కూడా ప్రజల ఉద్దేశాన్ని కాదని నాయకులు మాటే నమ్ముతు న్నారని వారు మదన పడుతున్నారు. రోజు విడిచి రోజు నీరు వ స్తున్న, అంతేకాకుండా కనీసం బిందె కూడా నిండ కముందే లైను నిలిచిపోతుందని ఆందోళన చెందు తున్నారు. ఎక్కడికి అక్కడ పైపులైను లీక కావ దంతో తాగునీరు కూడా కలుషితమైపోతుంది. స్థానిక నాయకులు చెప్పిందే అధికారులు పాటించి పైపులైన్ వ్యవస్థను చిన్నాభిన్నంచేసారన్న ఆరోప ణలు లేకపోలేదు. మోటర్లు నియంత్రిస్తామని కమీ షనర్ పలుమార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అమలు సాధ్యం కావడం లేదు. దీంతో పెద్దల ఇళ్ల ల్లో ఉన్న మోటార్లు నియంత్రంచక పోతే ఇదే పరి స్థితి కొనసాగుతుంది. మామూలు మత్తులో జోగు తున్న అధికారులు వ్యవస్థలో లోపాలను సరిగడం లేదు. ప్రజాధనం వృధా అవుతున్నప్పటికీ చర్యలు చేపట్టకపోవడం ఏమిటి అని పట్టణ పౌరులు నిల దీస్తున్నారు. ప్రజాస్వామ్యం పేరుతో ఊదరగొట్టే నేతలు ప్రజా సమస్యలను ఎందుకు పట్టించుకో వటం లేదని పట్టణ ప్రజలు ముక్తకంఠంతో నిందిస్తున్నారు.

సన్మార్గానికి మారుపేరు రంజాన్

ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు

- జామియా మసీదులో రంజాన్ తోఫా పంపిణీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: క్రమశిక్షణకు, సన్మార్గానికి మారుపేరు పవిత్ర రంజాన్ మాసమని ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు తెలిపారు. ఈ మాసంలో ముస్లింలు ఆధ్యాత్మికంగా మరింతగా లగ్నమై ఉంటారని, దైవానికి దగ్గర కావడమే కాకుండా దాతృత్వం, కరుణ, సహనం వంటి మంచి లక్షణాలను పెంపొందించుకుంటారని కొనియాడారు. ముఖ్యంగా పేదలకు సహాయం చేయడం వంటి మంచి పనులను చేయాలని భావిస్తారని అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా జామియా మసీదులో ఉగాది, రంజాన్ సందర్భంగా ముస్లీం సోదరులకు ఆదివారం రంజాన్ తోఫా, చీరెలు, టవళ్లు, దుస్తులను పంపిణీ చేశారు. ఎంతో భక్తి శ్రద్ధలు, క్రమశిక్షణతో రంజాన్ మాసాన్ని ముస్లింలు పాటిస్తారని కలెక్టర్ గుర్తుచేశారు. రంజాన్ మాసాన్ని కేవలం ముస్లింలే కాదు అందరూ గౌరవిస్తారని, సోదర భావంతో మెలిగే ఈ పవిత్ర రంజాన్ కార్యక్రమంలో తాను పాల్గొనడం అద ష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యం, సమానత్వం, సంప్రదాయం, ఆచారాలను స్వేచ్ఛగా చేసుకోవచ్చని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ సభ్యులు, ముస్లీం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి నిరసనగా ర్యాలీ

విశాలాంధ్ర-టెక్కలి: ఇటీవల పాస్టర్ ప్రవీణ్ పగడాల అకాల మరణానికి యావత్ క్రైస్తవ ప్రపంచం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ సందర్భంగా సోమవారం స్థానిక అబ్రహం పాస్టర్ చర్చ్ నుండి ఇంద్రగాంధీ కూడలి మీదుగా అంబేద్కర్ కూడలి వరకు క్రీస్తువులు ప్రవీణ్ మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పదంగా మృతి చెందడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ్ మరణంతో క్రైస్తవుల మనోభావాలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఆయన మృతిపై సామాగ్రి విచారణ నిర్వహించి నిజ నిజాలను బయటికి చెప్పాలని వారు కోరారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

హిందూ దేవాలయాల గోడలపై అన్యమత ప్రచారం

విశాలాంధ్ర-జలుమూరు: జలుమూరు మండలం ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయంతో పాటు మరికొన్ని ఆలయాల గోడలపై రాతలు శిలువ గుర్తులు ఆలయ పరిసరాలను పరిశీలించిన ఆర్ ఎస్ ఎస్, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు పోలీసుల రంగ ప్రవేశం పోలీసుల బందోబస్తు ఏర్పాటు జలుమూరు మండలం కామేశ్వరిపేటలో భారీగా పోలీసుల మోహరింపు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులుఆర్ ఎస్ ఎస్, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఉగాది రోజున చోటు చేసుకున్న ఘటనతో గ్రామస్తులు ఆందోళన తక్షణమే దుండగులను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు గ్రామానికి చేరుకున్న ముగ్గురు డీఎస్పీలు సీఐలు ఎస్సైలు ఎస్పీ మహేష్ రెడ్డి సందర్శన దండగలను నిలిచే ప్రసక్తే లేదని గ్రామస్తులకు హామీ ఇచ్చారు అక్కడికి జిల్లా నలుమూల నుండి సాదు పరిషత్ వారు హిందూ పరిషత్ స్వామి శ్రీనివాస్ పలువురు నేతలు పాల్గొని తీవ్రంగా ఖండించారు ఎంతటి వారైనా ఎంతటి దుర్మార్గానికి తలపెట్టిన వారికి శిక్ష పెట్టేవరకు గ్రామస్తులు విడిచిపెట్టరని పోలీసులు ముందు వివరించారు ఎక్కడో జరిగినటువంటి ఇటువంటి సంఘటనలు మారుమూల గ్రామాల్లో కూడా జరగడం అన్యాయమని గ్రామస్తులందరూ ముక్తకంఠంతో అన్నారు క్రైస్తవులను ఆ దుండగులను శిక్షించే వరకు మా పోరాటం ఆగదని గ్రామస్తులు ముక్తకంఠంతో తెలిపారు.

ఎండలు.... జర జాగ్రత్త..

ఎండ తీవ్రత పై పిల్లలకు, వృద్ధులకు తీసుకోవలసిన జాగ్రత్తల

- భగ భగ మంటున్న భానుడు నిప్పులు.
- తీవ్రతమైన ఎండల వల్ల అనర్థాలు.
- వడదెబ్బ లక్షణాలు.
- తీసుకోవలసిన జాగ్రత్తల పై అవగాహన.
- జ్యోతి హాస్పిటల్ ప్రతినిధి & వైద్యులు డా. సిగిలిపల్లి

విశాలాంధ్ర-టెక్కలి: ఈ ఏడాది భానుడు బగ్గు మంటు నిప్పులు కురిపిస్తున్నాడు. దీంతో వడదెబ్బ ప్రమాదం పొంచి ఉన్నట్లు జ్యోతి హాస్పిటల్ ప్రతినిధి & వైద్యులు డాక్టర్ సిగిలిపల్లి. రాజశేఖర్ (డిసిహెచ్, డి ఎన్ బి, పెడియాట్రిక్స్ పిజిపిఎన్ (బోస్టన్ యూనివర్సిటీ) ఐపిపిఎన్ (యూరోపియన్ సొసైటీ) వైద్యులు తెలుపుతున్నారు. రానున్న రోజులలో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ఇలాంటప్పుడు ఎండలో బయటికి వెళ్లే వాళ్ళు.. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇప్పటికే ఉష్ణోగ్రతలు 38 నుండి 40 డిగ్రీల సెంటీగ్రేడ్ దాటుతున్నాయి కాబట్టి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని అంటున్నారు. పెరుగుతున్న ఎండ వల్ల వడదెబ్బ బాధితుల సంఖ్య కూడా పెరుగుతుంది. పిల్లలకు పరీక్షలు పూర్తయి మరో నెల రోజుల్లో వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. కాబట్టి ఈ సమయంలో ఎంత ఎండగా ఉన్నా పిల్లలు బయట ఆడుకోవడానికి వెళు తుంటారు. ఇలాంటప్పుడు పిల్లలకు ఎండ తీవ్రత వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయి వాటి నుంచి కాపాడుకోవడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం....

త్వరలోనే బడులు ముగియడంతో పిల్లలు బయట ఎండలో ఆడుకోవడం సహజం. అయితే, ఉదయం నుంచే ఎండ తీవ్రంగా ఉంటుందని, దీంతో పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఎండలో ఆడటం, తిరగడం వల్ల డిహైడ్రేషన్, వడదెబ్బ తదుతరి సమస్యలు బారిన పడే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. అంతేకాకుండా పిల్లల్లో హీట్ రెగ్యులేషన్ సిస్టమ్ తక్కువ స్థాయిలో పనిచేయడం, వ్యాధి నిరోధక శక్తి కూడా తక్కువగా ఉండటం వల్ల పిల్లలు పెద్దలతో పోల్చితే త్వరగా వడదెబ్బకు గురయ్యే ఆస్కారం ఉంటుందన్నారు. వడదెబ్బకు గురైన వెంటనే చిన్నారులు డీహైడ్రేషన్ బారిన పడతారు. అంటే శరీరంలోని నీరు ఆవిరైపోతుందన్నమాట. ఎక్కువగా ఎండలో తిరగడం మాత్రమే కాకుండా వడగాలులు, సమయానికి ఆహారం తినకపోవడం వల్ల కూడా డిహైడ్రేషన్ సమస్య తలెత్తుతుందని చెబుతున్నారు. పిల్లలు ఎండలో తిరగడం వల్ల శరీరంలోని లవణాలు, నీరు వాతావరణం లోనే ఉష్ణోగ్రతలకు ఆవిరైపోతాయని, దీంతో వాళ్లు త్వరగా నీరసించి పోతారని అంటున్నారు. కాబట్టి వేసవిలో పిల్లలను సాధ్యమైనంత వరకు ఎండలో బయటికి వెళ్ళనీయకపోవడమే ఉత్తమం. ఎండాకాలంలో ఎక్కువ శాతం ద్రవ పదార్థాలు ఇవ్వాలని, బయట ఆహారానికి దూరంగా ఉంచాలని, ఒకవేళ బిడ్డలను బయటికి పంపాల్సి వస్తే ఎండ తగలకుండా తలకి టోపీ, గొడుగు తప్పనిసరిగా వాడాలని, ఎండలో బయటికి వెళ్లాల్సి వస్తే తెలుపు రంగు కాటన్ దుస్తులు వేసుకోవాలని తెలిపారు. ఎండాకాలంలో పిల్లలను నూనె పదార్థాలు, జంక్ ఫుడ్ కు దూరంగా ఉంచాలని, కలుషితమైన నీరు కలుషిత ఆహారం పదార్థాలు పట్ల జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ రాజశేఖర్ చెబుతున్నారు.

- తీవ్రమైన ఎండల వల్ల నష్టాలు

సూర్య కిరణాలు తలపై పడటం వల్ల మెదడు వాపునకు గురవుతుంది. శరీరంలో కండరాలు బిగుసుకు పోతాయి. ఎండ తీవ్రత వల్ల ఒంటిలో కండరాలు సంకోచించి, ఒళ్లంతా నొప్పిగా ఉంటుంది. అధిక ఉష్ణోగ్రత కారణంగా కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయం దెబ్బతింటాయి.

- వడదెబ్బ లక్షణాలు ఇవే..

వడదెబ్బ తగిలినప్పుడు కొంతమంది మూర్ఛపోతారు. శరీరంలో లక్షణాలు ఆవిరైపోవడంతో బాగా నిరసించిపోతారు. కొంతమంది డీహైడ్రేషన్కు గురవుతారు. కొందరు వాంతులు, విరోచనాలు, తీవ్ర జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తాయని పై లక్షణాలు కనిపిస్తే తప్పనిసరిగా పిల్లలను వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లాలని డాక్టర్ రాజశేఖర్ సూచిస్తున్నారు.

- ఐదేళ్ల లోపు పిల్లల విషయంలో...

ఐదేండ్ల లోపు చిన్నారులు చాలా సున్నితంగా ఉంటారు. తీవ్రమైన సూర్యరశ్మిని వారు తట్టుకోలేరు. ఎండలో చిన్న పిల్లలను బయట తిప్పడం వల్ల డయేరియాకు గురయ్యే ప్రమాదం ఉందని రాజశేఖర్ అన్నారు. అందువల్ల పిల్లలను ఉంచే గదులు చల్లగా ఉండేలా జాగ్రత్త పడాలని చెప్పారు.

-ఎండ తీవ్రత వలన తీసుకోవలసిన జాగ్రత్తలు

నాలుగేండ్ల లోపు పిల్లలకు ప్రతిరోజు 1 నుంచి 1.5 లీటర్ల నీరు తాగించాలిని, 4 నుంచి 9 ఏళ్ల పిల్లలకు 1.5 నుంచి 2 లీటర్ల నీరు తాగించాలని, పండ్ల రసాలతో డీహైడ్రేషన్ సమస్య తీరదు కాబట్టి పిల్లలు హైడ్రేట్ కావడానికి కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ తదితరి ద్రవ పదార్థాలు ఇవ్వాలిని, వేసవిలో ఎక్కువగా పిల్లలు ఇండోర్ గేమ్స్ ఆడేలా చూడాలని,ప్రతిరోజు ఉదయం రాత్రి స్నానం చేయించాలని, కలుషిత నీరు, కలుషిత ఆహారం తీసుకోకుండా చూడాలని, స్ట్రీట్ ఫుడ్ కు దూరంగా ఉంచాలని, పరిశుభ్రత పాటిస్తూ తరచూ చేతులను సబ్బుతో కడుక్కోవాలని, పిల్లలు వడదెబ్బకు గురైనప్పుడు వారిని వెంటనే చల్లటి ప్రదేశానికి తరలించాలని, నీరు త్రాగించాలని, పిల్లల ఉండే గదులు చల్లగా ఉండేలా చూసుకోవాలని, శిశువులకు అధికంగా తల్లి పాలు పెట్టాలని, రబ్బర్ డైపర్లు వాడకూడదని తెలుపుతున్నారు.

-డీహైడ్రేషన్ లక్షణాలు ఇవే...

నీరసంగా అనిపించడం, కళ్ళు లోపలికి వెళ్లినట్లు కనిపించడం, నోరు ఎండిపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరిగి జ్వరం రావడం, మూత్రం రాకపోవడం, మూత్రంలో మంట, పసుపు, ఎరుపు రంగులో మూత్రం విసర్జన లాంటి లక్షణాలు కనిపిస్తాయని డాక్టర్ సిగిలిపల్లి రాజశేఖర్ తెలుపుతున్నారు. వేసవిలో పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, అవసరమైతే తప్ప పగటి వేలలో బయటికి రాకూడదని, ఎండ తీవ్రత చిన్నపిల్లలు, గర్భిణీలు పై ఎక్కువగా ప్రభావం చూపుతుందని అంటున్నారు. త్వరగా డీహైడ్రేషన్కు గురై ప్రమాదం ఉన్న కారణంగా వీరికి తరచూ నీళ్లు, ఇతర ద్రవ పదార్థాలు త్రాగించాలని, ముఖ్యంగా గర్భిణీలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. కూల్ డ్రింక్స్ వంటివి కాకుండా ప్రకృతి సహజమైన కొబ్బరినీళ్లు, చెరుకు రసం, తాజా పండ్లరసాలు తీసుకోవడం మంచిదని అంటున్నారు. వాంతులు, విరోచనాలు వంటివి అయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని, సొంత వైద్యం తల్లి బిడ్డలకు ప్రమాదకరమని జ్యోతి హాస్పిటల్ ప్రతినిధి %డ% డాక్టర్ రాజశేఖర్ ఈ సందర్భంగా ఎండ తీవ్రత పై జాగ్రత్త లక్షణాలను విశాలాంధ్ర పత్రిక ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలియజేశారు.

సనాతన ధర్మ సేవలను గుర్తించి ప్రధాన అర్చకుని కి పురస్కారం

విశాలాంధ్ర-కవిటి: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన విశ్వావసు నామ సంవత్సర ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా బెజ్జి పుట్టుగ గ్రామంలో వెలసి ఉన్న పురాతన దేవాలయం శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి వారి ఆలయ ప్రధాన అర్చకుడు బాలక సత్యనారాయణ స్వామి కి ఉగాది పురస్కారం దక్కింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి శ్రీకాకుళం నియోజకవర్గం ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని వారి చేతుల మీదుగా బాలక సత్యనారాయణ స్వామి కి పురస్కారాన్ని అందజేశారు. ప్రధాన అర్చకుడిగా ఉన్న సత్యనారాయణ స్వామి సనాతన ధర్మ సేవలను గుర్తించి దేవాదాయ శాఖ ఎంపిక చేసిన ఆలయ అర్చకుల ఉగాది పురస్కారం సత్యనారాయణ స్వామికి అందజేశారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి వారి ఆలయ ధర్మకర్త పొందల కృష్ణా రావు, అర్చకులు గార వరాహ నరసింహస్వామి (రాజు స్వామి),రాజేష్ స్వామి,బార్ల వెంకట జగన్నాథం,బాలక వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

విశాలాంధ్ర-మెలియాపుట్టి: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ శత వసంతాల సందర్భంగా ఆ సంఘ సభ్యులు సలాన రాఘవరావు ఆధ్వర్యంలో మెలియాపుట్టి మండలం, వసుంధర గ్రామంలో ఉగాది వేడుకలను ఆదివారం నాడు ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ సంఘ సభ్యులు రాఘవరావు మాట్లాడుతూ తను సుమారుగా 40 సంవత్సరాలకు పైబడి ఆర్ఎస్ఎస్ సభ్యులుగా కొనసాగుతూ వివిధ సేవా కార్యక్రమాలు అందించడం జరుగుతుందన్నారు. ఆలాగే హైందవ సనాతన ధర్మం గూర్చి, ఉగాది విశిష్టతను గూర్చి తెలిపారు.సుమారు వేయి మందికి భవిష్యత్తులో స్వచ్ఛమైన ఆహార పదార్థాలను అందించే కార్యక్రమం చేపడుతున్నామని, దీంట్లో సేవ చేయాలనే తపనున్న యువత భాగమవ్వాలని, వారికి కనీస 15000 రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలకు సంబంధించి అనేక అంశాలను ఈ సందర్భంగా ఆయన తెలియజేయపరిచారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బాధ్యతలు కలిగి వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న డాక్టరేట్ అవార్డు గ్రహీత బెస్త కామేశ్వరరావు, వివిధ సైనిక పోరాటాల్లో తెగువ చూపించిన వీరజవాన్ బి. జయకృష్ణలతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లను సైతం సన్మానం చేసామన్నారు. అలాగే ఈ కార్యక్రమానికి సంబంధించి పలువురు వ్యక్తులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వారితో పాటుగా బిజెపి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ సలాన శరత్ కుమార్, బిజెపి పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వనజంకి రమేష్, రవికుమార్, శ్రీనివాసరావు, శంకర్రావు, అప్పలనాయుడు మాస్టారు, ఆర్ఎస్ఎస్ సభ్యులు, రైతులు, యువకులు, మహిళలు, పరిసర ప్రాంత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.